క్లుప్తంగా

అమ్మవారికి వెండి ఆభరణాల సమర్పణ



అమ్మవారికి వెండి ఆభరణాలు అలంకరించిన దాతలు

కాళ్ల: మండలంలోని కోపల్లె గ్రామంలో వేంచేసియున్న కనకదుర్గ, పరాలమ్మ అమ్మవార్లకు దాతలు శుక్రవారం వెండి ఆభరణాలను సమర్పించారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి రాధాకృష్ణరాజు, రామావతి దంపతులు, కుమార్తె, మనవడు కలిసి మూడు కేజీల ఆభరణాలు అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా తెప్పోత్సవం



పెదపాపయమ్మ చెరువులో నిర్వహిస్తున్న తెప్పోత్సవం

కాళ్ల: గ్రామంలో వేంచేయున్న శ్రీమహంకాళమ్మ, శ్రీవెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాల్గో రోజైన శుక్రవారం రాత్రి గ్రామ దేవతలకు స్థానిక పెదపాపాయమ్మ చెరువులో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. గ్రామానికి చెందిన పన్నాసి వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతులచే అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ధాన్యం మద్దతు ధర పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.3 వేలు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం పట్టణం దుర్గాపురంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతకాయలు బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మంతెన సీతారాం, కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, పీవీ ప్రతాప్, జుత్తిగ నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ ఆఫీసర్‌గా దుర్గాప్రసాద్



దుర్గా ప్రసాద్‌కు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

వీరవాసరం: ఎస్ఎంబీటీఏవీఅండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న వి.దుర్గాప్రసాద్‌ను పశ్చిమగోదావరి జిల్లా జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు శుక్రవారం తెలిపారు. నియామక పత్రాలను వి.దుర్గాప్రసాద్‌కు ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది దుర్గా ప్రసాద్‌ను అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ మండలాధ్యక్షుడు చిగురుపాటి మాణిక్యాలరావు

పాలకోడేరు: కార్మిక దినోత్సవం సందర్భంగా పాలకోడేరులో పెయింటర్లు సమావేశమై నూతనంగా యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి పాలకోడేరు మండల పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిగురుపాటి మాణిక్యాలరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పెయింటర్లకు గుర్తింపు కార్డులు, లేబర్ కార్డులు అందిస్తామని చెప్పారు. అనంతరం రిక్షా కార్మికుడు సైదు వెంకటేశ్వరరావు, వడ్రంగి మేస్త్రి అయిరెడ్డి కొండ, పెయింటర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిర్రా చిన్ని ఎన్నికయ్యారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కోమటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఊడి కిరణ్, సహాయ కార్యదర్శి దిరిసిపో చంటి, కోశాధికారి బి.నరేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్టదా ?

- గ్రేడ్‌వన్ మున్సిపాలిటీలో తాండవిస్తున్న అపారిశుద్ధ్యం
- మురికి కుపాల్లో పందుల సంచారం
- మున్సిపల్ హెల్త్ విభాగం అధికారుల నిర్లక్ష్యం
- ప్రత్యేక అధికారి జేసీ దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు



మావుళ్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం



చినరంగనిపాలెంలో అధ్వానంగా ఉన్న డ్రెయిన్

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రేడ్ వన్ మున్సిపాలిటి భీమవరంలోని ప్రజల ఆరోగ్యానికి ముప్పు వస్తోంది. మున్సిపల్ పారిశుద్ధ్య, హెల్త్ విభాగం అధికారులు పూర్తి నిర్లక్ష్యానికి భీమవరం ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారు. అధ్వాన పారిశుద్ధ్యం వలన వేసవిలో దోమలు, వైరస్‌లు విజృంభించి ప్రజలను రోగాల పాలు చేస్తున్నాయి. కోట్ల రూపాయల ఆదాయం ఉన్న భీమవరం మున్సిపాలిటీ అద్దంలా ఉండాలి. కాని అధ్వానంగా ఉంది.

మురికి కూపాల్లో పందుల సంచారం

భీమవరం పట్టణంలో పలు ఖాళీ స్థలాల్లో మురికి నీరు నిల్వ ఉండడంతో వాటిలో పందులు స్వైర విహారం చేస్తూ వ్యాధులకు కారణమవుతున్నాయి. భీమవరం ఆర్టీసీ డిపో వెనుక, ఎఫ్‌సీఐ గోడౌన్స్ పట్టణ చివరి ప్రాంతాల్లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా ఆర్టీసీ డీపో ఇండస్ట్రియల్ ఏరియాలోని ఖాళీ స్థలంలో ఇటువంటి పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. చాలా కాలంగా ఈ సమస్య ఉన్నా మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు పట్టించుకోవడం లేదు.

అధ్వాన డ్రెయిన్లతో పెరుగుతున్న దోమల ఉద్ధృతి

భీమవరం పట్టణంలో డ్రెయిన్ల అభివృద్ధి గాలికి వదిలి వేయడంతో ప్రతి డ్రెయిన్ అధ్వానంగా మారి దోమల ఉద్ధృతికి నిలయంగా మారాయి. దోమలతో అనేక వైరస్‌లు విజృంభించడంతో డ్రెయిన్లకు అనుకుని, సమీపంలో ఉన్న ఇళ్ల వారు వ్యాధుల భారిన పడుతున్నారు.

రోడ్ల వెంబడి చెత్తాచెదారం

పట్టణంలో రోడ్ల వెంబడి చెత్తాదారం పేరుకుపోయినా మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల రోజుల తరబడి చెత్తాచెదారం వదలి వేయడం, ప్రధాన సెంటర్లలో మధ్యాహ్నం రెండు గంటలకు కూడా చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బంది ఎక్కువ పని తక్కువ

భీమవరం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కువ పని తక్కువ అన్నట్లు ఉంది. భీమవరం మున్సిపాలిటీ 39 వార్డులు కాగా శానిటేషన్‌కు సంబంధించి 7 డివిజన్లు ఉండగా ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది 360 మంది ఉన్నారు. చెత్త సేకరణ కోసం 13 ట్రాక్టర్లు, చెత్త లిఫ్ట్ చేసే వాహనాలు 4, జేసీబీ 1 ఉన్నాయి. అలాగే 25 క్లాప్ వాహనాలను ఇటీవల వినియోగించుకుంటున్నారు. సిబ్బంది, వాహనాలు ఉన్నప్పటికీ ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లుగా ఉంది పట్టణంలో పరిస్థితి.

జేసీ సార్ దృష్టి సారించాలి

భీమవరం మున్సిపల్ ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి భీమవరం పట్టణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి. జిల్లా కేంద్రమైన భీమవరం మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుపరిచి మిగిలిన మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలవాలి. కోట్ల రూపాయల ఆదాయం ఉన్న ఈ మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధికి జేసీ చర్యలు తీసుకోవాలి. వచ్చే వర్షా కాలం దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా డ్రెయిన్లు, ఖాళీ స్థలాల పూడిక, వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుదలపై చర్యలు తీసుకోవాలి.

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు

భీమవరం: సూక్ష్మ సేద్య పథకంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అందిస్తుందని దీనికిగాను రైతులు తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి పి.వీరభద్రరావు చెప్పారు. బిందు సేద్యం సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడీ, ఇతర చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, మధ్య తరహా రైతులకు 70 శాతం, పెద్ద రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ సబ్సిడీపై ఇవి పొందడానికి రైతులు ఆధార్‌కార్డు, భూమి యాజమాన్య పత్రంతో రైతుసేవా కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్ సేవలను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

పాలకోడేరు: అసంఘటిత కార్మికులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేయించుకోవాలని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ.సురేష్‌బాబు సూచించారు. దీని వలన ప్రమాదం జరిగినప్పుడు బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.సురేష్‌కుమార్, ఎన్.సుధీర్, అంబేడ్కర్, సచివాలయ కార్యదర్శి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటాడుకుందాం



తణుకు ఆర్చరీ శిక్షణా శిబిరంలో బాలలు



కబడ్డీ శిక్షణలో బాలికలు

- జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని పూర్తిగా వృథా చేయకుండా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో గురువారం ప్రారంభమైన క్రీడా శిక్షణ ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించి, శిక్షణ పూర్తి చేసిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తారు. జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ శిబిరాల వివరాలను డీఎస్‌డీఓ ఎం.రాజేష్ తెలిపారు. ఎనిమిది నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు శిక్షణ ఇచ్చే విధంగా క్రీడా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి ప్రారంభమైన శిక్షణలో కొత్త వారిని కూడా చేర్చుకుంటారని, వీటిని బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడా శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

- **ఆర్చరీ:** తణుకు మాంటిస్సోరి స్కూల్
- **అథ్లెటిక్స్:** తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం డీఎన్నార్ కళాశాల, తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు హైస్కూల్, శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్
- **బాస్కెట్‌బాల్:** మార్టేరు ఎస్‌వీజీజెడ్పీ స్కూల్, తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు హైస్కూల్, తణుకు జెడ్పీహెచ్ఎస్ బాయిస్ స్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, తణుకు మాంటిస్సోరీ స్కూల్, పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్
- **బ్యాడ్మింటన్:** పెనుగొండ ఎస్‌వీకేపీ కేఎస్‌రాజు కళాశాల
- **బాక్సింగ్:** పెనుమంట్ర ఎస్ఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, నవుడూరు కేఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, అత్తిలి జెడ్పీ బాయిస్ హైస్కూల్, తణుకు ఎస్‌సీఐఎంజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అత్తిలి ప్రభుత్వ హైస్కూల్
- **క్రికెట్:** పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల
- **ఫుట్‌బాల్:** పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్, భీమవరం లూథరన్ హైస్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల
- **జిమ్నాస్టిక్:** భీమవరం డీఎన్నార్ కళాశాల
- **హాకీ:** భీమవరం సెంట్‌మేరీస్ హైస్కూల్, శృంగవృక్షం జెడ్పీ హెచ్ఎస్ హైస్కూల్,
- **కబడ్డీ:** తాడేపల్లిగూడెం టీఎస్ఎం జెడ్పీహెచ్ స్కూల్, తణుకు ఎస్‌సీఐఎం ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, తణుకు మాంటిస్సోరీ స్కూల్, పెనుగొండ ఎస్‌వీకేసీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- **కరాటే:** మార్టేరు ఎస్‌వీజీజెడ్పీ స్కూల్
- **స్కిప్పింగ్:** తణుకు మున్సిపల్ పార్క్, తణుకు మాంటిస్సోరీ స్కూల్,
- **టేబుల్‌టెన్నిస్:** భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్,పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్‌రాజు కాలేజీ
- **తైక్వాండో:** తాడేపల్లిగూడెం ద్రోణాచార్య స్పోర్ట్స్ క్లబ్
- **టెన్నిస్:** భీమవరం డీఎన్ఆర్ కళాశాల
- **త్రోబాల్:** సిద్ధాపురం జెడ్పీహెచ్ స్కూల్
- **వాలీబాల్:** మండపాక ప్రైమరీ స్కూల్ నంబర్ 3, గుట్లపాడు జెడ్పీహెచ్ స్కూల్, ఇలింద్రపర్రు జెడ్పీహెచ్ స్కూల్, తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం డీఎన్నార్ కళాశాల, సిద్ధాపురం, తణుకు జెడ్పీహెచ్ స్కూళ్లు, అత్తిలి హైస్కూల్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల
- **యోగా:** గుట్లపా డు జెడ్పీహెచ్ స్కూల్, భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్

విద్యుత్ కోతతో జనం ఉక్కిరిబిక్కిరి

ఆకివీడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల క్లియరెన్స్ పేరుతో సరఫరా నిలుపుదల చేయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. భానుడి భగభగలు, ఉక్కబెట్టిన వాతావరణంతో వృద్ధులు, పిల్లలు అల్లాడిపోయారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలుపుదల చేయడంతో ఎండ తీవ్రతకు తల్లడిల్లిపోయారు. అనుకున్న సమయానికి సరఫరా ఇవ్వకపోవడంతో ప్రజలు విద్యుత్ శాఖ అధికారులపై మండిపడ్డారు. ఇదిలా ఉంటే ఆక్వా రైతులు మరింత ఇబ్బంది పడ్డారు. పలు చోట్లకు వెళ్లి జనరేటర్ల కోసం వెతుకులాడుకోవలసి వచ్చింది.

6న ప్రతిభావంతులకు పురస్కారాలు



సమావేశంలో మాట్లాడుతున్న కంతేటి వెంకటరాజు

భీమవరం(ప్రకాశంచౌక్): ఈ నెల 6వ తేదీన భీమవరం త్యాగరాజ భవనంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన 110 మంది ప్రతిభావంతులకు పురస్కారాలను అందిస్తున్నట్లు శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భీమవరం పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాల్లో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 110 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌తో పురస్కారాలను అందిస్తామని తెలిపారు. గత 27 ఏళ్లుగా శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ ఈ పురస్కారాలను అందిస్తున్నామని, ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కుక్కల బాల, అరసవల్లి సుబ్రమణ్యం, మడిపల్లి చంద్రశేఖర్, పుప్పాళ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: పాఠశాలల్లో ప్రభుత్వ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేది నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల వర్గీకరణకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. డిమాండ్ల సాధన కోసం సంఘం మూడు అంచెల ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందన్నారు. మే 5న పాత తాలూకా కేంద్రాల్లో, 9న జిల్లా కేంద్రాల్లో, 14న విజయవాడలో ధర్నా చేస్తామని తెలిపారు.

భార్యాభర్తల గొడవపై కేసు నమోదు

భీమవరం: టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎస్.వెంకట్రావు శుక్రవారం చెప్పారు. పట్టణానికి చెందిన కాగిత కుమారి, ఆమె భర్త శ్రీనివాస్ గొడవ పడడంతో ఇద్దరూ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికల ఉన్నతికి 'కిశోరి వికాసం'



కాళ్ల: మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ తాతపండు



వీరవాసరం: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు



భీమవరం అర్బన్: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కాళ్ల: ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోరి వికాసం -వేసవి శిక్షణా తరగతులు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రారంభించారు. దొడ్డనపూడిలో మాజీ ఎంపీపీ ఆరేటి తాతాపండు ముఖ్య అతిథిగా హాజరై కౌమార బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.నిర్మల, సీహెచ్.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల విడుదల

వీరవాసరం: కిశోర బాలిక వికాసం-వేసవి శిక్షణా కార్యక్రమాల ప్రణాళిక వాల్ పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులు చేయవలసిన అవసరం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజిని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ మంగతాయారు, సెక్రటరీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యమే భవిష్యత్‌కు ధీమా

ఉండి: కిశోర బాలికల సమయంలో మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటే వారి భవిష్యత్ కాలానికి అదే ధీమాగా ఉంటుందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శుక్రవారం ఉండి పెదపేటలో కిశోరి వికాసం ప్రత్యేక వేసవి కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షక కార్యదర్శి బి.సత్యవతి, ఏఎన్ఎం వి.కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

పాలకోడేరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కుముదవల్లిలోని మండల పరిషత్ ప్రత్యేక పాఠశాల వద్ద శుక్రవారం కిశోర బాలికలకు ఆరోగ్య సూచనలు అందించారు. మహిళా పోలీసు కోనాల బేబి, ఏఎన్ఎం హేమలత, అంగన్‌వాడీ వర్కర్లు టి.జెమీమా, పి.జాస్మిన్, సీహెచ్ జ్ఞానసుందరి, సీహెచ్ కనకదుర్గ, టి.సుబ్బలక్ష్మి, టి.ఆలిస్‌మేరీ, ఆశా వర్కర్లు పి.మేరీమణి, ఎం.ఝాన్సీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

భీమవరం అర్బన్: బాలికలు, యువతులు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్ వాడీ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి అన్నారు. వెంప అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, హెచ్ఎం రమేష్, కలిదిండి రామచంద్రరావు, ఏఎన్ఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

దశ, దిశ నిర్దేశించేది కిశోరి వికాసమే

ఆకివీడు: బాలికల ఉజ్వల భవిష్యత్‌ను నిర్ణయించేది కిశోరి దశేనని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు.సచివాలయం-5లో శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఉండి: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



పాలకోడేరు: అవగాహన కల్పిస్తున్న కుమారి



ఆకివీడు: మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు

ఆకివీడు: హిందూ ధర్మ పరిరక్షణ నేటికీ కొనసాగుతుందంటే జగద్గురు ఆది శంకరాచార్య వల్లేనని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్ అన్నారు. మండలంలోని కుప్పనూడి గ్రామంలో ఆయన నివాసం వద్ద జగద్గురు ఆది శంకరాచార్య, జైమాతాజీ జయంతిని నిర్వహించారు.

మావుళ్లమ్మ దేవస్థానంలో..

భీమవరం(ప్రకాశంచౌక్): జగద్గురు ఆది శంకరాచార్య స్వామి జయంతి సందర్భంగా మావుళ్లమ్మ దేవస్థానంలో గురు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు అందజేశామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

వీరవాసరం: శ్రీఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా రాయకుదురులో శంకరాచార్యుల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదర్శ బాల బాలా జీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో పలువురు ప్రసంగించారు